క్లుప్తంగా

మద్యం దుకాణాల వద్ద కోలాహలం


కన్నాపురంలో మద్యం దుకాణం కొనుగోలుకు పోటీ పడుతున్న జనం

కొయ్యలగూడెం: వైన్ షాపుల వద్ద మద్యం ప్రియులు క్యూ లైన్లు కడుతున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ ఆంక్షల మేరకు 48 గంటలపాటు మద్యం దుకాణాలు మూసివేస్తారు. దీంతో శనివారం సాయంత్రం 6 గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు దుకాణాలు మూసివేస్తారని ప్రచారం ఉండడంతో మద్యం ప్రియులు రెండు రోజులకు సరిపడా మద్యం బాటిళ్లు కొనేందుకు బారులు తీరుతున్నారు. రెండు రోజులు డ్రైడేగా ఎలక్షన్ కమిషన్ ప్రకటించింది. జూన్ నాలుగో తేదీన కూడా మద్యం దుకాణాలు మూసివేయాల్సిందిగా ఆదేశించింది. కొయ్యలగూడెం, కన్నాపురం, బయ్యన్నగూడెం, యర్రంపేట గ్రామాల సమీపంలో ఉన్న మద్యం దుకాణాల వద్ద వందలాదిగా మద్యం ప్రియులు కోలాహలం కనబడుతుంది.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.1.01 లక్షల విరాళం


దాత విద్యాస్వరూప్ దంపతులకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు శనివారం రూ.1,01,116 లను విరాళంగా అందజేశారు. ఏలూరుకు చెందిన వెల్లంకి విద్యాస్వరూప్ దంపతులు ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాత దంపతులకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

శ్రీవారి సేవలో భువనేశ్వరి పీఠాధిపతి


శ్రీ కమలానంద భారతి స్వామికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని గన్నవరంలోని భువనేశ్వరి పీఠాధిపతి శ్రీ కమలానంద భారతి స్వామి శనివారం సందర్శించారు. స్వామీజీకి ఆలయ అధికారులు, అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు స్వామీజీకి శ్రీవారి ప్రసాదాలను అందజేయగా, ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు చినవెంకన్న జ్ఞాపికను అందించారు.

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ శ్రేణులు


ఇంజరంలో టీడీపీ శ్రేణులకు వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పుతున్న వైస్ ఎంపీపీ రాజేష్

కుక్కునూరు: ఎన్నికల ప్రచారానికి చివరి రోజు మండలంలో వైఎస్సార్ సీపీ నాయకులు జోరుగా ప్రచారం చేశారు. మండలంలో టీడీపీ నుంచి పలు చోట్ల వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వింజనం గ్రామంలో దాదాపుగా టీడీపీ ఖాళీ అయ్యింది. ఆ పార్టీ కార్యకర్తలు వైస్ ఎంపీపీ తాండూర్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలోకి చేశారు. సీతారామనగరం, సీతారాంపుర ం, ఉప్పర, మద్దిగట్ల తదితర గ్రామాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు వైసీపీ కండువాలు కప్పుకున్నారు.

ముస్లింల బైక్ ర్యాలీ


చింతలపూడిలో ప్రచారం చేస్తున్న ముస్లింలు

చింతలపూడి : జగనన్నతోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రక్షణ ఉంటుందని ముస్లిం నేతలు పేర్కొన్నారు. చింతలపూడిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ముస్లింలు శనివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ముస్లిం నాయకులు ఎండీ అక్బర్ ఆలీ, ఎండీ జిలాని, ఖాజా మొయినుద్దీన్‌ల నేతృత్వంలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కె.సునీల్ కుమార్ యాదవ్, కంభం విజయరాజులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఇమ్రాన్, రహ్మాన్, భక్షు, ఎండీ సాదిఖ్, హఫీజ్, రజాక్, ఇక్బాల్, అహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే ప్రజలకు భరోసా

- ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు
- ముగిసిన ఎన్నికల ప్రచారం
- జంగారెడ్డిగూడెంలో భారీ ర్యాలీ

జంగారెడ్డిగూడెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ప్రజలకు భరోసా అని, వైఎస్సార్ సీపీ విజయం కోసం నెలరోజులు పాటు ప్రతి నాయకుడు, కార్యకర్తా సమన్వయంతో సమష్టిగా అలుపెరుగని కృషిచేశారని చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు, పోలవరం నియోజకవర్గ పరిశీలకులు జెట్టి గురునాథరావు అన్నారు. జంగారెడ్డిగూడెంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ గెలవాలనే ఉద్దేశంతో కలిసికట్టుగా జంగారెడ్డిగూడెం పట్టణంలో ప్రచారం చేసిన నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్, టీడీపీ హయాంలో అధికారం పెద్దపెద్ద నాయకులు, ధనవంతులకు పరిమితమైందని, పేదలు ఏ అవసరం వచ్చినా వారి వద్దకు వెళ్లాల్సివచ్చేదని, వారి రికమండేషన్ ద్వారానే పనులు జరిగేవని ర్తుచేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదల ఆత్మగౌరవం దెబ్బతినకుండా, వలంటీర్‌ల ద్వారానే అన్ని సంక్షేమ పథకాలూ పారదర్శకంగా అందించామన్నారు. ధనవంతులకు అన్యాయం జరిగిందని మాట్లాడే చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు జగన్ ప్రభుత్వంలో పేదలకు అన్యాయం జరిగిందని చెప్పగలరా అని ప్రశ్నించారు. రకరకాల అబద్ధపు ప్రచారాలు చేస్తూ వైఎస్సార్ సీపీని ఓడించాలని వారు చూస్తున్నారని, ప్రజల కోసం ఆలోచించడం లేదని అన్నారు.




జంగారెడ్డిగూడెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు
జంగారెడ్డిగూడెంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు →

పేదల పక్షాన జగన్

ఈ ఎన్నికలు పేదవాడికి, ధనవంతుడికి పోరాటమని, పేదల పక్షాన సీఎం జగన్ పనిచేస్తున్నారని విజయరాజు, గురునాథరావు అన్నారు. ధనవంతులు చూసి ఓర్వలేక జగన్ పట్ల లేనిపోని అపోహలు సృష్టించి సుపరిపాలన దూరం చేయాలని చూస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పేదల కడుపునింపే పరిస్థితి ఆంధ్రాలో ఉందని, టీడీపీ, జనసేనల అసత్య ప్రచారాన్ని నమ్మొద్దని పజలకు సూచించారు. లాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై అసత్య ప్రచారాలు చేస్తున్నారని, ఏ ఒక్క రైతూ అధైర్య పడొద్దని, ఈ యాక్ట్‌పై జగన్‌మోహన్‌రెడ్డికి ఎటువంటి సంబంధం లేదని, ప్రతి సెంటు భూమి, స్థలం ఎవరికీ చెందినవి వారికే ఉంటుందని వివరించారు. పాస్‌బుక్‌లపై జగన్ ఫొటో ఉందంటే రైతు భరోసా కల్పించడానికేనని, అందరూ జగన్‌పై నమ్మకముంచి మరోసారి సీఎంగా గెలిపించాలని కోరారు.

హైదరాబాద్ స్థాయిలో అభివృద్ధి

జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎంగా పగ్గాలు చేపట్టిన తరువాత, రానున్న ఐదేళ్లల్లో కాలంలో సీఎం జగన్ సహకారంతో మెట్ట ప్రాంతాన్ని హైదరాబాద్ స్థాయిలో అభివృద్ధికి కృషి చేస్తామని విజయరాజు, జెట్టి గురునాథరావు హామీ ఇచ్చారు. ఏలూరు జిల్లాలో రెండో అతి పెద్ద ముఖ్య పట్టణం జంగారెడ్డిగూడెం. అవినీతి అనే మాటకు తావులేకుండా జంగారెడ్డిగూడెం పట్టణం అభివృద్ధి చేస్తామని చెప్పారు. ముఖ్యంగా పట్టణంలోని కొంత మేర వెనుకబడిన 27, 28, 29, 1 వార్డుల అభివృద్ధికి కృషిచేస్తామని, అందరికీ అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. 13న జరిగే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ వైఎస్సార్ సీపీకి సహకరించి, ఎమ్మెల్యేగా కంభం విజయరాజు, ఎంపీగా కారుమూరి సునీల్‌కుమార్‌లను ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ట్రాక్టర్లతో భారీ ర్యాలీ

జంగారెడ్డిగూడెం రూరల్: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కంభం విజయరాజు, కారుమూరి సునీల్ కుమార్ గెలుపు కోరుతూ ఆ పార్టీ శ్రేణులు 50 ట్రాక్టర్లు, 50 ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. ఎ.పోలవరం, చిన్నంవారిగూడెం గ్రామాల నుంచి ర్యాలీగా పార్టీ శ్రేణులు జంగారెడ్డిగూడెం చేరుకున్నారు. జై జగన్ నినాదాలతో ర్యాలీ కొనసాగింది. జంగారెడ్డిగూడెం చేరుకున్న శ్రేణులను వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు జెట్టి గురునాథరావు, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జిలు స్వాగతం పలికి ర్యాలీలో పాల్గొన్నారు. సర్పంచ్ బుద్దాల సీతారామరాజు, ఎంపీటీసీ పసుపులేటి వరలక్ష్మి, నాయకులు, బుద్దాల సత్యనారాయణ, బెజవాడ నాగరాజు, బండారు సుబ్బారావు, కొట్టే వీర్రాజు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ భారీ ర్యాలీ

జంగారెడ్డిగూడెం: ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా జంగారెడ్డిగూడెంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో భాగంగా భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కారుమూరి సునీల్‌కుమార్, కంభం విజయరాజు విజయాన్ని కోరుతూ ఆ పార్టీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఏలూరు రోడ్డులోని జీడిగింజల కర్మాగారం నుంచి ప్రారంభమైన ర్యాలీ రామచంద్రాపురం, ఆటో నగర్, బస్టాండ్‌సెంటర్, బోసుబొమ్మ సెంటర్, అశ్వారావుపేట రోడ్డు, త్రివేణీ కళాశాల రోడ్డు, జేపీ సెంటర్, పాత బస్టాండ్, బుట్టాయగూడెం రోడ్ బైపాస్ సెంటర్, బైపాస్ రోడ్డు, రాజీవ్ నగర్, లోకేష్ నగర్, డాంగేనగర్‌ల మీదుగా కొనసాగింది. ర్యాలీలో చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, పోలవరం పరిశీలకులు జెట్టి గురునాథరావు, పామర్రు నియోజకవర్గ పరిశీలకులు మండవల్లి సోంబాబు, మేడవరపు విద్యాసాగర్, వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, ఉభయగోదావరి జిల్లాల బూత్ కమిటీల కోఆర్డినేటర్ బీవీఆర్ చౌదరి, పట్టణ, మండల అధ్యక్షుడు చిటికెల అచ్చిరాజు, వామిశెట్టి హరిబాబు, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, బత్తిన చిన్న, కాసర బన్ని, మండల మహిళా కమిటీ అధ్యక్షురాలు గుబ్బల సత్యవేణి, కౌన్సిలర్‌లు, నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

చివరి రోజు సుడిగాలి ప్రచారం

కొయ్యలగూడెం: ఎన్నికల ప్రచారం చివరి రోజు శనివారం మండల వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు సుడిగాలి పర్యటన చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మొదలుకొని అన్ని పంచాయతీ గ్రామాల్లో పర్యటించారు. ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. ప్రచురించిన మేనిఫెస్టో అంశాలను పంపిణీ చేస్తూ ముందుకు సాగారు. కొయ్యలగూడెంలో వైఎస్సార్ సీపీ యూత్ నాయకుడు ఏలేటి భాస్కర్ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం చేశారు. ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మిలను గెలిపించాలని కోరారు.

వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీ ర్యాలీ

కొయ్యలగూడెం: వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మిల గెలుపు కోరుతూ ఆ పార్టీ గవరవరం, చొప్పరామన్నగూడెం గ్రామాల శ్రేణులు శనివారం మోటార్ బైక్‌ల భారీ ర్యాలీ నిర్వహించారు. పొంగుటూరు నుంచి కొయ్యలగూడెం వరకు నాలుగు కిలో మీటర్ల మేర జాతీయ ప్రధాన రహదారిపై బైకుల ర్యాలీ నిర్వహిస్తూ జగన్ నినాదాలతో హోరెత్తించారు. ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి జగనన్న రుణం తీర్చుకోవాలని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పిలుపు ఇచ్చారు. ముందుగా గవరవరం చొప్పరామన్నగూడెం గ్రామ పంచాయతీల పరిధిలో మహిళా నాయకులతో కలిసి గడపగడపకు బొట్టు పెడుతూ ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. రెండు పంచాయతీల పరిధిలో ఇప్పటివరకు జరిగిన సంక్షేమ పథకాలు, అభివృద్ధికి సంబంధించిన అంశాలను కరపత్రాలుగా ముద్రించి పంపిణీ చేశారు.


కొయ్యలగూడెం : పార్టీ మేనిఫెస్టోతో ప్రచారం చేస్తున్న యూత్ నాయకులు


కొయ్యలగూడెం : గవరవరంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

మక్కినవారిగూడెంలో ప్రచార హోరు

టి.నరసాపురం: మక్కినవారిగూడెంలో వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తెల్లం రాజ్యలక్ష్మి, ఎంపీగా కారుమూరి సునీల్‌కుమార్‌లకు అఖండ మెజార్టీ చేకూర్చాలని కోరారు. ఇంటింటికి వెళ్లి డమ్మీ ఈవీఎంలతో ఓటు వేసే విధానాన్ని వివరించారు. ఏఎంసీ డైరెక్టర్ ఆచంట నాగమణి వృద్ధులకు సైతం ఇంటింటికీ వెళ్లి ఈవీఎంలలో ఓటు వేసే విధానాన్ని వివరించారు. ప్రచార కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ పిన్నమనేని చక్రవర్తి, ఏఎంసీ డైరెక్టర్ ఆచంట నాగమణి, వైస్ ప్రెసిడెంట్ నీరుకొండ అరుణ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

జగన్‌ను మళ్లీ సీఎంను చేద్దాం

పోలవరం రూరల్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని, ప్రతి ఒక్కరూ ఫ్యాన్‌గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు తెల్లం రాజ్యలక్ష్మి, కారుమూరి సునీల్‌కుమార్‌లను గెలిపించాలని వైఎస్సార్ సీపీ నాయకులు పిలుపునిచ్చారు. పోలవరం మండలంలో శనివారం ముగింపు సందర్భంగా విస్తృత ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. కొత్త పట్టిసీమ గ్రామంలో మైగాపుల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వలవల బాలాజీ, తొర్లపాటి రాజశేఖర్, సానా రామకృష్ణ, రంభ శ్రీనివాస్, తోట సత్యనారాయణ, సూరెడ్డి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

చివరిరోజు ప్రచార హోరు

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో వైఎస్సార్ సీపీ ప్రచారం చివరిరోజు శనివారం హోరెత్తింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయా గ్రామాల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేశారు. జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెంలో ఆ పార్టీ మండల కన్వీనర్ చందా ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. నాయకులు చిట్టిబొమ్మ శ్రీను, బూరుగు ప్రేమ్‌కుమార్‌తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. ములగలంపల్లిలో గంటసాల గాంధీ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. గ్రామంలో ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. వైస్ ఎంపీపీ సోమగాని శ్రీను, నాయకులు కొప్పుల బాలు ఆధ్వర్యంలోనూ ప్రచారం చేశారు. జీలుగుమిల్లిలో ఎంపీపీ కోర్సా పోచమ్మ, జెడ్పీటీసీ మల్లం వసంత రావు, తదితరులు ప్రచారం చేశారు. బుట్టాయగూడెం మండలంలోని అన్ని సచివాలయ పరిధిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేశారు.


బుట్టాయగూడెం: జీలుగుమిల్లిలో ప్రచారం


టి.నరసాపురం : మక్కినవారిగూడెంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


టి.నరసాపురం : వృద్ధులకు ఈవీఎంపై ఓటు వేసే విధానాన్ని వివరిస్తున్న దృశ్యం


పోలవరం రూరల్: కొత్త పట్టిసీమ గ్రామంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


బుట్టాయగూడెం: ములగలంపల్లిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న దృశ్యం

ఆదరించండి.. ఆశీర్వదించండి

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాజ్యలక్ష్మి


చిన్నకాపవరంలో ప్రచారం చేస్తున్న రాజ్యలక్ష్మి

బుట్టాయగూడెం: ఈ నెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపించాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి కోరారు. బుట్టాయగూడెం మండలం గుళ్లపూడి, రాచూరు, లంకాలపల్లి, కాపవరం, కుమ్మరికుంట, మంచులవారిగూడెం, తదితర గ్రామాల్లో శనివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రజాసేవ చేయాలనే ఉద్దేశంతో ఉపాధ్యాయ ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చానని ప్రజలు తనను ఆదరించాలని కోరారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన జగన్ మళ్లీ సీఎంగా గెలిస్తేనే పేదలందరికీ మేలు జరుగుతుందని అన్నారు. కూటమి నాయకులు ఆచరణ సాధ్యంకాని హామీలిస్తూ మోసం చేయాలని చూస్తున్నారని, వారి మాయమాటలను నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. టీడీపీ మేనిఫెస్టో ఒక భూటకమన్నారు. కరోనా కష్టకాలంలో కూడా జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల అమలును ఎక్కడా ఆపలేదని చెప్పారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారని వివరించారు. ప్రతి కుటుంబానికి మేలు జరిగితేనే ఎటేయండని చెప్పిన దమ్మున్న నాయకుడు జగనన్న అని చెప్పారు. ప్రతిఒక్కరూ వారి ఇంట్లో మేలు జరిగితేనే రెండు ఫ్యాన్ గుర్తులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ మొడియం రామతులసి, వైస్ ఎంపీపీ కుక్కల వరలక్ష్మి, ఎంపీటీసీ మొడియం వెంకాయమ్మ, నాయకులు మొడియం మంగారావు, కృష్ణవేణి, మడకం సు రేష్, కుర్సం రాముడు, సరియం రామారావు, కొ మరం రమేష్, మడకం సింగరాజు, కుర్సం గోపి, స రియం రాంబాబు, సరియం పెంటయ్య,పాల్గొన్నారు.

పారిజాతగిరి వెంకన్నకు పూజలు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఉత్తరం వైపు ఏడు కొండల్లో ఆరో కొండపై వేంచేసియున్న శ్రీవేంకటేశ్వరస్వామి వారికి ప్రీతికరమైన రోజు శనివారం కావడంతో వేకువజామున సుప్రభాతసేవ ఆరాధన బాలబోగనివేదన తీర్థప్రసాదగోష్టి అనంతరం భక్తులకు దర్శనమిచ్చారు. వేసవి కాలం కావడంతో భక్తులకు ఉచిత మజ్జిగ వితరణ ఆలయ కార్యనిర్వహణాధికారి చేయించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ నరసన్నపాలెంనికి చెందిన తాత రామారావు, హైదరాబాద్‌కు చెందిన ఇ.కామరాజు, విజయవాడకు చెందిన తెల్లం సత్యనారాయణ నిర్వహించారు.

చింతలపూడి అసెంబ్లీ ఎన్నికల్లో ఫ్యాన్ గాలి


విజయరాజు

చింతలపూడి : పోలింగ్ సమయం దగ్గర పడుతుండటంతో చింతలపూడి అసెంబ్లీ పోరు రసవత్తరంగా మారింది. నియోజకవర్గంలో ఫ్యాన్ గాలి బలంగా వీస్తుండటంతో ప్రత్యర్థులు బెంబేలెత్తుతున్నారు. అసెంబ్లీ బరిలో 8 మంది అభ్యర్థులు ఉండగా, ప్రధాన పోటీ వైఎస్సార్ సీపీ, టీడీపీ అభ్యర్థుల మధ్య నెలకొంది. నియోజకవర్గంలో కొత్తగా చేరిన ఓటర్లతో కలిపి మొత్తం 2,71,374 మంది ఓటర్లు సోమవారం తమ ఓటు హక్కును నియోగించుకోనున్నారు. నియోజకవర్గ కేంద్రం, జిల్లాలో అత్యధిక ఓటర్లు కలిగిన చింతలపూడి పైనే అందరి చూపు ఉంది. వైఎస్సార్ సీపీ అభ్యర్థి కంభం విజయరాజు నామినేషన్ వేసిన నాటి నుంచీ ఓటర్లను కలిశారు. గ్రామీణ ఓటర్లు వైఎస్ జగన్ నాయకత్వాన్ని బలంగా కోరుకుంటుండటంతో ఇక్కడ తన గెలుపు నల్లేరు మీద నడకేనని విజయరాజు భావిస్తున్నారు. టీడీపీ తామే గెలుస్తామని మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తోంది. వైఎస్సార్ సీపీ అభ్యర్థితో పోల్చుకుంటే టీడీపీ అభ్యర్థి రోషన్ కుమార్ ఎన్ఆర్ఐ కావడంతో ఓటర్లు ఆయన పట్ల అంత సుముఖంగా లేరని తెసుస్తోంది. దీంతో టీడీపీ నేతలు గ్రామాల్లో కుల రాజకీయాలకు తెరలేపారని విమర్శలు వస్తున్నాయి. టీడీపీ నాయకులు ఎన్ని కుయుక్తులు పన్నినా అధిక శాతం ఓటర్లు మాత్రం ఫ్యాన్ వైపు చూస్తున్నారని విజయరాజు ధీమా వ్యక్తం చేస్తున్నారు. వైఎస్ హయాంలో చేసిన అభివృద్ధి, జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు విజయరాజు విజయానికి దోహద పడతాయని భావిస్తున్నారు. తనను గెలిపిస్తే మొదటి ప్రాధాన్యత రైతులకు ఇచ్చి చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పూర్తి చేయిస్తానని విజయరాజు హామీ ఇస్తున్నారు. అదే విధంగా చింతలపూడి పట్టణాన్ని అభివృద్ధి చేసి సుందరీకరిస్తానని చెబుతున్నారు. నియోజకవర్గంలో ప్రధాన రహదారులను అభివృద్ధి చేస్తానని, తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీకి సంపూర్ణ మద్దతు


తగరం రాంబాబు

బుట్టాయగూడెం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి తమ సంఘం సంపూర్ణ మద్దతు ఇస్తుందని దళిత సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి తగరం రాంబాబు అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. జగన్ పాలనలో దళిత గిరిజన సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. విద్య, వైద్య సదుపాయాలు కల్పించడంలో జగన్ కృషి మరువలేనిదని చెప్పారు. సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందుతున్నాయని అన్నారు. రాష్ట్రాభివృద్ధి చూసి ఓర్వలేక టీడీపీ, జనసేన, బీజేపీలు కూటమిగా ఏర్పడి జగన్‌ను ఓడించేందుకు కుట్రలు చేస్తున్నాయని, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై దాడులు చేస్తున్నాయని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలు తలెత్తుకుని కాలర్ ఎగరేసుకుని జీవిస్తున్నారంటే ఆ గొప్పతనం జగన్‌దేనని అన్నారు. రాష్ట్రస్థాయి చైర్మన్, కేబినెట్ హోదాలో డైరెక్టర్‌లు, నెంబర్ పదవుల్లో ఎక్కువగా మాదిగ సామాజిక వర్గానికే అవకాశం కల్పించారని వివరించారు. చంద్రబాబు ఎస్సీ వర్గీకరణ చేస్తానని మాట ఇచ్చిమాట తప్పి మోసం చేశారని గుర్తుచేశారు. మాదిగలకు పూర్తి న్యాయం జగన్‌తోనే సాధ్యమవుతుందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు అందరూ కృషి చేయాలని కోరారు.

నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు


పోలవరంలో మాట్లాడుతున్న డీఎస్పీ సురేష్‌కుమార్ రెడ్డి

పోలవరం రూరల్: ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఎం.సురేష్‌కుమార్ రెడ్డి హెచ్చరించారు. పోలవరంలోని డీఎస్పీ కార్యాలయం వద్ద శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. శనివారం సాయంత్రం నుంచి సైలెంట్ మోడ్ అమలులోకి వచ్చిందని, సబ్ డివిజన్‌లో 144 సెక్షన్ అమలు చేస్తున్నామని చెప్పారు. నియోజకవర్గంలో 50 సమస్యాత్మక గ్రామాలు ఉన్నాయన్నారు. కేంద్ర బలగాలతో నియోజకవర్గంలో ఎన్నికల బూత్‌ల వద్ద గట్టి బందోబస్తు నిర్వహిస్తామని చెప్పారు. పోలింగ్ స్టేషన్‌లోకి మొబైల్ ఫోన్‌లు తీసుకెళ్లరాదన్నారు. మద్యం షాపులను 13వ తేదీ సాయంత్రం వరకు నిషేధిచామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అవసరమైన చోట శాటిలైట్ ఫోన్‌లను వినియోగిస్తున్నామన్నారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల దూరం వరకు నిషేదాజ్ఞలు అమలులో ఉంటాయని చెప్పారు. పోలవరం సీఐ మధుబాబు, ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ సమావేశంలో పాల్గొన్నారు.

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి


కేఆర్‌పురంలో మాట్లాడుతున్న ఆర్వో సూర్యతేజ

బుట్టాయగూడెం: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఐటీడీఏ పీఓ, పోలవరం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం సూర్యతేజ తెలిపారు. శనివారం ఐటీడీఏ వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడారు. పోలింగ్ ప్రక్రియ 13వ తేదీ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుందన్నారు. పోలింగ్ స్టేషన్లలో ఓటర్లకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఎండబారిన పడకుండా షామియానాలు, వైద్య శిబిరాలు, వయోవృద్ధులు, తల్లులు, దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. పోలవరం నియోజకవర్గంలో సుమారు 2,52,657 మంది ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రతి పోలింగ్ బూత్ వద్దా గట్టి బందోబస్తు ఏర్పాటేశామన్నారు. సుమారు 2000 మందికి పైగా పోలింగ్ సిబ్బంది కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ నుంచి ఈవీఎంలను తీసుకుని ఆదివారం మధ్యాహ్నం ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకుంటారని చెప్పారు. రాజకీయ పార్టీలు ఎన్నికలకు సహకరించాలని ఆయన కోరారు.